రత్నాక్షతలు

"వలపుల పల్లకీతో పిల్లివాటంగా ఉంది నీ వ్యవహారం బాలా!" విసుగ్గా చేతిలో పుస్తకం పక్కన పడేస్తూ అన్నది కామేశ్వరి.

"అంటే గోడమీద పిల్లివాటం అనా నీ ఉద్దేశ్యం.. వలపుల పల్లకీ అని అందంగా అన్నదానివి మళ్ళీ పిల్లేమిటి... పద భ్రష్టుత్వం నువ్వూనా...." మాట్లాడుతోంది శశిరేఖ.

మౌనంగా నేలచూపులు చూస్తూ అప్పుడప్పుడు తలకాయ ఎత్తి అంతంత కళ్ళతో కన్నీళ్ళ పుళ్లతో స్నేహితురాళ్ళను చూసుకుని మళ్ళీ తలకాయ వంచి... మోకాలు మీదగ చుబుకం ఆనించి తనే చాలా "విషాదాంత కథ" లా ఉన్నది బాల.

"ఇది ఉక్కి బేల...ఎలాగే దీంతో. ఇప్పుడు ఆంటీ వస్తే చంపేస్తారు..." గట్టిగా అంటోంది కామేశ్వరి.

"ఏమైంది పెద్ద? ఉత్తరం వచ్చింది... అంతేగా, అది తప్పా..." దబాయిస్తోంది భయంగానే శశిరేఖ.

"ఉత్తరాలు రావచ్చే...కానీ ఇంత భయంకరంగానా?..." కామేశ్వరి అంటోంది.

చేతిలో ఉత్తరం చూస్తోంది బాల.

ఎన్నోసార్లు ఆ అబ్బాయి "నువ్వంటే ఇష్టం" అన్నాడు. తన మెప్పుకోసం స్కూలు ఫస్ట్ వచ్చాడు. అప్పుడప్పుడు కవిత్వం రాశాడు. అవన్నీ వేరు.

ఇప్పుడు...

ఉత్తరం రాశాడు. ఇంకుతో కాదు. పోనీ కామేశ్వరి కవిత్వంలో అన్నట్లు "కన్నీళ్ళ"తో కాదు.. మరీ ఘోరంగా..రక్తంతో..

అది చూసే అంతా ఒణికిపోయారు.

చాలా చిన్నారి పొన్నారి చిట్టితల్లిలా "నాకంత ప్రేమకు అర్హత ఉందా?" ఏడ్చింది బాల.

అదే భయంగా వుంది శశికి, కామేశ్వరికి.

బాల తల్లి డాక్టర్ దేవి. గొప్పపేరు, ఆర్జన రెండూ ఉన్నాయి ఆవిడకు. మాట్లాడకుండా చూపులతో భయపెట్టగలదు. ఆవిడ ఏరకమైన నాన్సెన్స్ కూడా భరించదు. చాలా ప్రాక్టికల్ మనిషి అని పేరు. ఆ విషయంలో ఆవిడమీద ఆవిడకే చాలా గౌరవం కూడా.

బాల ఆవిడ ఒక్కగానొక్క ముద్దుల కూతురు.

ఆవిడకి ఇదంతా తెలిస్తే!?

అదే ఆ పదహారు పదిహేడు ఏళ్ల పిల్లల భయం...బాలనేమంటుందో?! "అది దాచెయ్యి" లేకపోతే చించెయ్యి అని సలహా చెప్పేవారు శశి, కామేశ్వరి మామూలుగా.. కానీ బాల ఈసారి సెంటిమెంటు మాట్లాడుతోంది. కళ్లంబడి నీళ్ళు పెట్టుకుంటోంది... కాసేపట్లో ఆ కాస్త మాటా... "అతణ్ణి నేను ప్రేమిస్తున్నానే..." అంటుందేమోనన్న భయం వాళ్లిద్దరికీ సంపూర్ణంగా ఉంది.

కానీ ఆ మాట తమతో అంటే పరవాలేదు. ఈ పిచ్చిపిల్ల తల్లితో అనేస్తుందేమో... ఆ తరవాత.. ఆ బీభత్సం అసలు భరించడం కష్టం.

"ఇప్పుడు ఏమిటి దారి?" అబ్బాయిల్ని ఏడిపించి, ఎంకరేజ్ చేసి, ఇవన్నీ మామూలు ఆటలు ఆ వయస్సులో కానీ, అవి సీరియస్ మలుపు తీసుకుంటే?!

"ఇప్పుడు ఈ అబ్బాయి చాలా అజ్ఞానంలో ఉన్నాడు..." పొడుగాటి జడ విప్పి మళ్ళీ వేసుకుంటూ స్టేట్‌మెంట్ యిచ్చేసింది కామేశ్వరి.

"ఇది అజ్ఞానమా? ప్రేమించడం అజ్ఞానమా.. మంచం కోడులా మొహం నువ్వూనూ... రానురాను భావుకత తగలడి పోతోంది జనంలో...ఛా!ఛా!" కొంగుతో ఏ.సి. రూంలో కూడా విసురుకుంటూ అన్నది శశి.

"ఏమన్నావ్? మంచంకోడులా ఉందా నా మొహం.... నీ టొండ ఉపమానం నువ్వూనూ. మళ్లీ నువ్వు మాట్లాడతావు భావుకతలగురించి సంకర సమాసాల గురించి.." అరుస్తోంది కామేశ్వరి.

ఇంక ఆ తగూ తీరేది కాదు.. అది తెలుసు బాలకు. వాళ్లంతా నాలుగోక్లాసునుంచీ బెంచిమేట్స్, క్లాస్‌మేట్స్ కూడా. ఎప్పుడూ, ముగ్గురిలో ఇద్దరు పోట్లాడుకుంటూ ఉంటారు. ఇద్దరే ఉంటే, మూడోవాళ్లు లేరే అని బాధపడుతూ ఉంటారు.

కళ్లు మూసుకుని తల గోడకానించి ఆలోచిస్తోంది బాల. ఆమె గుండెల్లోపల తీయటి తలపు.

తనతో ఒక్కమాట కూడా ఎప్పుడూ మాట్లాడని ఆ అబ్బాయి పేరు విరించి.. పుస్తకం.. అడిగాడు నోట్స్ కోసం

తిరిగి వచ్చిన పుస్తకంలో ప్రతి పేజీలో ఖాళీ ఉన్నచోట అల్లా "బాల" నామం రాశాడు.

చచ్చేట్లు తిట్టింది బాల "స్టుపిడ్, ఇడియట్, మానర్స్ లేదు" వగైరా అని. లేత కపోలాలు కోపంతో కందిపోయాయి. తిడుతోందే కానీ, మొగ్గ విరుస్తున్న స్త్రీత్వం గర్వంతో పడగవిప్పింది. ఆ వయస్సులో పొగడ్త, ఆరాధన చాలా హాయిగా, గొప్పగా, తీయగా ఉంటాయి.

కానీ ఆ విషయం అతడికి తెలిసిపోతే భరించలేదు మళ్లీ.

"నిజం చెప్పూ, నేనంటే నీకు ఇష్టంలేదూ?" ఎల్లటి గుండెల్లో రోజాపువ్వు గుచ్చి ఆమె పుస్తకాల పైన పెట్టి ఉంది.

"ఎంత కార్డ్‌బోర్డ్ అయినా మరీ అంత హార్ట్‌షేపులో ఎలా కత్తిరించి, ఎఱ్ఱపేపరు అతికించాడు!" ఆశ్చర్యపోతూ కళ్లు తిప్పుతూ అన్నది శశి.

"ఆఁ - వాళ్ళ అన్నయ్య ఆర్టిస్టులే...గీయించి ఉంటాడు. వాళ్లంతా చాలా ఆర్టిస్టిక్ ఫామిలీ..." చెప్పేసింది కామేశ్వరి.

"నిజమా!" ఇంకా వివరాలు ఎవరైనా అడగకుండా చెబితే బావుంటుందనిపిస్తోంది బాలకు.

"అయినా అసలా ప్రశ్న ఏమిటి? బాలకు తనంటే ఇష్టమని వ్యుత్పత్తా?" దీర్ఘంతీస్తూ అంటోంది కామేశ్వరి.

ఆఁ! దెబ్బతిన్నది బాల అహం. అందులో నిజం ఉందేమోనన్న భయంతోనూ, అది అందరూ గ్రహిస్తారేమోనన్న జంకుతోనూ "ఆత్మగౌరవం" వగైరా పదాలు వాడేసి హెడ్‌మాస్టర్‌కు విరించి మీద రిపోర్ట్ ఇచ్చింది.

ఆ కథ రకరకాల మలుపులు తిరిగింది. విరించికి చాలా శారీరక, మానసిక వ్యథ కలిగింది.

అదంతా ఆఖరికి రక్తాక్షరాల ఉత్తరంగా రూపుదిద్దుకున్నది. ఆ ఉత్తరం చూసి బాల ఏడుస్తోంది. బాధపడుతోంది. నిట్టూరుస్తోంది. ఈ గందరగోళం అంతా స్నేహితురాళ్లకు కొంచెం సరదాగా ఉన్నా, డాక్టర్ అంటే భయం చాలా ఎక్కువగా ఉంది.

ఆవిడ ప్రసిద్ధి చెందిన గైనకాలజిస్ట్. చాలా ప్రాక్టికల్‌గా ఉండే ఆవిడకు విచిత్రమైన సెంటిమెంట్స్ ఉన్నాయి. హాస్పిటల్‌లో బైట అమ్మవారి విగ్రహం, చుట్టూ కొవ్వొత్తుల లాంటి బల్బుల మధ్య వెలిగిపోతూ ఉంటుంది. అమ్మవారు మొదటి సెంటిమెంటు. రెండవ సెంటిమెంటు బాల.

"ఆవిడ చిన్నప్పటినుంచీ దేవీ భక్తురాలుట... మనిషిలో ఆ తేజస్సు, నిర్భయత్వం.. ఆవిడ ఎదురుగా నిలబడి మాట్లాడలేరు ఎవరూ! ఆవిడ అంటే ఇష్టం ఉన్నవాళ్ళు ఇలా చెప్పుకుంటారు:

"ఆఁ! అసలు మొదటినుంచీ మహా పొగరు ఆవిడకు. ఎవర్నీ కేర్ చేసేది కాదుట. ఇటువంటి వాళ్లకి స్నేహితులుండరు. ఇదుగో, ఏదో ఒక అవుట్‌లెట్ కోసం ఇలా దైవిక శక్తిమీద ఆధారపడతారు ఇల్లాంటివాళ్లు. ఆ విగ్రహమైతే బాధపెట్టదు. ప్రశ్నలు వెయ్యదు.. అహం మీద దెబ్బ తీయదు. వీళ్లకు మనుష్యులంటే భయం. చులకన, కసి. ఇదంతా సైకలాజికల్ పాయింటు".. ఇలా మాట్లాడేవాళ్లలో లెనిన్ శాస్త్రి ఒకడు. పాపం, వాళ్ల నాన్నకు లెనిన్ అన్నా, భార్య అన్నా సమానమైన భయం. వాళ్ల ఆవిడ తండ్రి పేరు సుబ్బుశాస్త్రి. దాంతో తన ఆదర్శాలవల్ల, పెళ్లాం భయంవల్ల ఒక్కగానొక్క కొడుకు పేరు అలా రూపుదిద్దుకుంది. ఏది విచిత్రంగా

ఉంటే, అది చాలా గొప్ప విషయంగా భావించే లెనిన్‌శాస్త్రి కావాలనే ఆ పేరు అట్లాగే ఉంచుకున్నాడు.

అతనికి ఉన్న వీక్‌నెస్‌లో ఆడవాళ్ల గురించి మాట్లాడ్డం మొదటిదైతే, తరవాత వీక్‌నెస్ మైక్.

ఒకరోజు ఏదో ఫార్మల్‌గాదరింగ్‌లో ఎవరో పాడుతుంటే జోక్స్ చెపుతానని మైక్ లాక్కుని లెక్చర్ ప్రారంభించాడు అతను. ప్రారంభం అయితే చేశాడు గానీ, ఆ తరవాత మాట్లాడేమాటలమీద అతనికి కంట్రోల్ పోయింది.

"షటప్!" ఒక్కసారి గర్జించింది డాక్టర్ దేవి.

"ఆడవాళ్ళకు అనాటమీ, కొలతలు, రక్తప్రసరణ తప్ప మరేం లేవా? శృంగారం షోడశ కళలు ఇవన్నీ ఉత్ప్రేక్షాలంకారాలా?! షటప్. ముందు అతని చేతుల్లోనించి మైక్ తీసుకోండి..." ఆ గొంతుముందు హిమవన్నగాలే తలవంచుతాయేమో అన్నంత పదును ఉంది.

అంతే, ఆరోజునుంచీ ఆవిడ ఉన్నప్పుడు లెనిన్ శాస్త్రి ఉట్టి "కవి", "కొనబడదు. "వినబడదు. ఆవిడ లేనప్పుడు విజృంభించి మాట్లాడేస్తూ ఉంటాడు పాపం. అప్పుడు వీలైనంత వరకూ ఆవిడ సెన్టిమెంటు మీద దెబ్బకొడుతూ ఉంటాడు. ఇప్పటిదాకా అమ్మవారు టార్గెట్ పాపం.. ఇప్పుడు అదే కాలేజీలో చదువుతున్న మేనగోడలు వల్ల బాల విషయం తెలిసింది అతనికి.

"మొగతోడు లేని పెంపకం పాపం. ఏంచేస్తుంది? కూతురు బాల ప్రేమలో పడితే ఇప్పుడు ఆ 'బాలా త్రిపుర సుందరి' రక్షిస్తుందా? చూద్దాం.." ఆ రోజు ధైర్యంగా, ఆవిడ వినాలనే వాగాడు రెస్టరూంలో.

అంతే, సివంగిలా వచ్చింది దేవి ఇంటికి.

ఒక్క అయిదు నిమిషాలు బాల గదిబైట నిలబడింది. అప్పటికే ఆడపిల్లలు, ఎవరూ వినడంలేదనుకుంటే ఏమేమి మాట్లాడతారో అవన్నీ మాట్లాడుకుంటున్నారు.

లోపలికి వెళ్లి ఫట్‌ఫట్‌మని బాలను ఆ లెంపా, ఈ లెంపా వాయించింది. ఆవేశంతో నోటికి వచ్చినట్టల్లా తిట్టింది.

"ఏం స్నేహాలు మీవి?" బాలస్నేహితురాళ్లిద్దర్నీ చివాట్లు పెట్టింది. "ఎవడేవాడు?" జవాబు వినకుండానే చెంపలు వాయించి పారేసింది.

దుర్గాదేవిలా విజృంభించి, ఇల్లు రణరంగం చేసి, అలసిపోయి సోఫాలో జారగిలబడి కూర్చుంది దేవి.

ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయిన బాలను చూడగానే జాలేసింది. అప్పుడు చూసింది, బాల పువ్వుల్లాంటి చేతుల్లో దాచుకుని గుండెలకు హత్తుకుని ఉన్న కాగితం.

"ఏమిటి బాల చేతుల్లో?" అనుమానంగా అడిగింది. "ఉత్తరం.." బిక్కచచ్చిపోతూ అన్నారు ఇద్దరు ఆడపిల్లలూ, మెల్లిగా తీసుకుంది ఆవిడ..

"కాళమ్మా! పిల్లలు ముగ్గురికీ జ్యూస్‌పట్రా..." పనిమనిషిని పిలుస్తూ మెల్లగా ఉత్తరం విప్పుతోంది డాక్టర్ దేవి.

ఒణికిపోతున్నారు కామేశ్వరి, శశి..

"ఏమిటి అక్షరాలు ఇలా.." ఉత్తరం వెలుతురులో పెట్టి చూస్తూ అన్నది ఆవిడ.

"రక్తం.." గభాల్న నోరు జారింది కామేశ్వరి.

"రక్తం..." ఆశ్చర్యంగా అంటూ ఆ కాగితం అలా ఒదిలేసింది దేవి...

❀ ❀ ❀

"రక్తం...."

ఎందుకో ఆ మాట కార్ డ్రైవ్ చేస్తున్నా, హాస్పిటల్‌లో పని చేసుకుంటున్నా వేటాడుతూనే ఉన్నది. డెలివరీ కేసు ఒకదాన్లో ఓవర్ బ్లీడింగ్...కాలికి ఎదురుదెబ్బ తగిలి ధారగా రక్తం... ఎక్కడ చూసినా రక్తం..

ఏదో హిప్నటైజ్ అయినట్లు అయిపోతోంది డాక్టర్ దేవి. అదివరకు ఆమెకు తెలియని రక్తం కాదు. మరి?! ఎందుకో ఆ అమాయకుడైన కుఱ్ఱాడు తన రక్తంతో రాసిన అక్షరాలు ఆమె గుండెల్లో ఎక్కడో దాక్కున్న అతి సున్నితమైన భావనను, ఇంతకాలం "ఇగో" కింద అణగదొక్కిన జ్ఞాపకాల్ని నిద్రలేపుతున్నాయి.

పుష్యమీ నక్షత్రం, పౌర్ణమి కలిసి వచ్చాయని అమ్మవారికి పూజ చేయిస్తోంది.

రత్నాక్షతైర్వా పరిపూజయామి ముక్తా ఫలైర్వా రుచిర ప్రవాళైః ।
అఖండితైర్దేవి యవాదిభిర్వా కాశ్మీర పంకాంకిత తందు లైర్వా ॥

అమ్మవారికి కుంకుమాక్షతలు వేస్తూ మంత్రం చదువుతున్నాడు పూజారి.

రత్నాక్షతలు రక్తాక్షతలుగా వినబడ్డాయి దేవికి.. అమ్మవారిమీద జల్లున రాలాయి.

అంతే-సడెన్‌గా కుర్చీలో వాలిపోయింది దేవి. ఆ తరవాత ఏసిరూంలో, నీలిరంగు కాంతిలో, ఇండోర్ ప్లాంట్సు మధ్య ఎంత ప్రశాంతమైన వాతావరణం ఉన్నా ఆమెను వెన్నంటుతూనే ఉన్నాయి...రక్తాక్షతలు.

ఆనాడు ముద్దుగా పెంచిన బాలమీద చెయ్యెత్తడం. రక్తంతో రాసిన ఆ ఉత్తరం, ఆ తరవాత ఎక్కడ చూసినా రక్తం దర్శనమివ్వడం, ఆఖరికి అమ్మవారి సన్నిధిలో కూడా ఎఱ్ఱటి అక్షతలు మంత్రపూతమవ్వడం...ఏదో తెలియని బలమైన ఆలోచనాకెరటం మెదడును తప్పించుకుని హృదయంమీద నొక్కుతున్నట్లుంది.

'ఏమిటీ నాన్సెన్స్? ఈ ఆలోచనల పీడ ఏమిటి?' విసుక్కున్నది డాక్టర్ దేవి. కాని, ఆలోచనలు మనసును వంచించేది బలహీన క్షణాల్లోనే..ఆమె శారీరకంగా, మానసికంగా కూడా అలసిపోయింది.

"నా పేరు రుద్ర..నీ పేరు దేవి..బావుంది కదూ!" గర్వంగా ఒకింత ఒంకరగా నవ్వుతూ విన్నది అతని మాటలు. అమ్మమ్మతోపాటు నీళ్లకు వెళ్లి కృష్ణలో స్నానం చేసి, ఎఱ్ఱటి ఇసుకలో పాంజేబుపట్టాల పాదం పెట్టగానే కందిపోతాయేమోనని గభాలున నాలుగు తామరాకులు తీసుకువచ్చి పరిచే ఆ బలమైన చేతులు.. అమ్మమ్మగారి ఊళ్లో ఉన్నంతకాలం రోజుకు ఒకరకం పూవులు తన అమ్మవారి అష్టోత్తరానికి వచ్చి చేరేవి. వాటి వెనకాల పూవులాంటి మనస్సు.

దేవి సన్నగా, గీరగా నవ్వుకునేది - తనకోసం ఒక మనిషి పడే కష్టం తలుచుకుని.

తను ఏటి ఒడ్డున కూర్చుంటే దూరం నుంచి చూసే చూపులు, తనకు జ్వరం వస్తే దదుపు పీబాదులు, ఆంజనేయస్వామికి ఆకుపత్రి పూజలు, వడమాలలు...

"నా జ్వరం సంగతి సరే... వడలు చాలా బావున్నాయి. అసలు నీకు తినాలి అని ఉంది, నన్ను అడ్డం పెట్టుకున్నావు. అవునా?" అని ఉడికిస్తే తెలిసీ తనను ఆట పట్టిస్తున్న మేనమామ కూతుర్ని ఎలా నమ్మించాలో తెలియని బేలకళ్లతో చూసే రుద్ర...

తను కాలేజీలో చేరింది. అతని ఉత్తరాలు చూసి నవ్వుకునేది. ఏదో చెప్పాలనీ, అది మాటలమధ్య దాచాలనీ అతని ప్రయత్నం. సాధించే ఓపికలేదు దేవికి. ఒక్కొక్కసారి చూడకుండా చింపేసేది.

"ఏమిటి పాపం, ఆ పిల్లాడు?" అనేది అమ్మమ్మ కొడుకు బిడ్డ గురించి.

"పెళ్లి పిచ్చి..పల్లెటూళ్లో పనిలేక, తిని కూర్చోలేక..." ఇలా చాలా మోటుగా మాట్లాడేది దేవి, తను చాలా నాగరికురాలనుకుని.

ఎమ్.బి.బి.ఎస్. స్టూడెంటు ఆమె, ఎస్.ఎస్.ఎల్.సి. ఫెయిల్ అయిన రుద్ర. ఎలా కలవగలరు తామిద్దరు?!

"ఆడదానిలో కాస్త మృదుత్వం, ఆడతనం ఉండాలి ఎంత ప్రొఫెషనల్స్ అయినా".. స్నేహితురాలు కేకలేసేది.

"అదుగో, అవి ఎక్కువ అయ్యే వాటిని కాపాడుకోడానికి చేతికి గాజుల సంకెళ్ళు, కాళ్లకు మట్టెల సంకెళ్లు, మెడకొక ఉరితాడు.." రపీమని మాట్లాడి నోరుమూయించేది-అందర్నీ.

ఆమెకట్టు, బొట్టు, నడక, మాట అంతా చాలా కొలిచినట్లుండేవి. "ఈ సమయంలో ఇలా మాట్లాడాలి. ఇలా ఉండాలి" అన్నది చాలా జాగ్రత్తగా అలవరుచుకున్నది ఆమె.

బాధలో ఉన్నవారిని నవ్వుతూ ఓదార్చడం, పనికుర్రాడు కూరలు లెక్క తప్పు చెప్పాడని వెంటనే ఉద్యోగం నుంచి తీసి వెయ్యడం - రెండూ చాలా మామూలుగా చేసేదామె.

"పక్కా ప్రొఫెషనల్" అనుకునేవారంతా.

"నా ఉత్తరాలకు జవాబు ఇవ్వలేదేం?" అమ్మమ్మతో తోడువచ్చి అడిగాడు రుద్ర.

"నాకే వ్యవహారం హద్దు మీరడం ఇష్టం ఉండదు..." సూటిగా చెప్పింది.

అతను బాధపడ్డా బైటపడలేదు. "ఇలా ఎప్పటికప్పుడు ఎలా బ్రతకాలో ఊహించుకుని బ్రతకడం నటనగా, ఆర్టిఫిషియల్‌గా లేదూ?! చీర కొంగు మడతల దగ్గర నుంచి, నువ్వు చేసే సర్జరీలో కత్తుల వరకూ అంతా కొలిచినట్లు బతికితే జీవితం మొహం మొత్తుతుంది, హాయిగా, ఎవరికోసం కాకుండా, మనకోసం మనం నవ్వుకోవడం, కావలసినంత తిని, కంటినిండా నిద్రపోవడం, ఎదటివాళ్ళను హాయిగా ఉంచడం-ఇవ్వన్నీ అసలు నీకు అర్థం కావనుకుంటాను!" నిర్భయంగా అన్నాడు ఒకరోజు రుద్ర.

"మోటు మనిషి. ఇతనికేం తెలుసు బ్రతకడం? ఇంటికి వచ్చిన మేనమామ కొడుకును అవమానించావని అమ్మమ్మ బాధపడుతుంది." చాలా కష్టపడి కోపం కంట్రోల్ చేసుకున్నది దేవి.

"వాడికి నువ్వు తప్ప ప్రపంచంలో ఏం కనిపించడం లేదే. అంత ప్రేమించిన మనిషిని తృణీకరించకే... రుద్రకు చదువులేకపోయినా, ఆస్తి ఉన్నది," బ్రతిమిలాడింది అమ్మమ్మ.

"ఇంకా నయం... నేనూ రుద్రా పెళ్ళి చేసుకోవడం అసంభవం అమ్మమ్మా! కేవలం ఆడది, మొగవాడు ఒక కప్పుకింద బ్రతకడం కాదు పెళ్లి అంటే... వంట చేసి, వేరుశనక్కాయ ఉడకబెట్టి, ఎండబోసి, పొడి చెయ్యడం చేతనైన పిల్లకావాలి రుద్రకు. నేను, నా స్నేతస్కోపు, ఉద్యోగం.. ఒక్కసారన్నా ప్రాక్టికల్‌గా ఆలోచించు..." అని చివాట్లు పెట్టింది.

ఊరినించి ఎవరైనా వచ్చినప్పుడల్లా రుద్ర "నీకిష్టమని నాకు తెలుసు' అని పంపించే వెన్నకాచిన నెయ్యి, బెల్లం ఆవకాయ, పూతరేకులు-ఇవన్నీ ఆమెకు నవ్వులాటగా ఉండేది. కానీ తన ఇష్టాలు ఎదటి వ్యక్తి గ్రహించడం ఇష్టంలేదు ఆమెకు.

"ఎంత ప్రేమ ఆ పిచ్చి వెధవకు?!" అని అమ్మమ్మ అన్నప్పుడల్లా,

"ఆc! డాక్టరు పెళ్లికూతురు కోసం ఏమన్నా చేస్తాడు!" అని వెక్కిరించేది.

కానీ, ఒకసారి అమ్మమ్మ మంచం పట్టిందని తెలిసి, చూసిరావాలని ఆ ఊరు వెళ్లింది దేవి. ఉన్న ఆ పదిహేనురోజుల్లోనూ ఆమె తెలియకుండానే ఆ జీవితంలో ఎంతో ప్రశాంతత ఉందనిపించింది. వాళ్లకు సంస్కారం లేదనుకునేది. కానీ వాళ్లకు లేనిది వస్తుభ్రాంతి అనిపించింది. అనవసరమైన కోరికలు లేకపోవడమే అమ్మమ్మ కుటుంబపు సంస్కారం అని అర్థమైంది. ఆ ఆహ్లాదత, ఆరాధించే వ్యక్తి ఎంత కరుకు మనిషినైనా కదిలించి రాగరంజితం చేస్తాయి.

చాలా దగ్గరైంది దేవి రుద్రకు. అతని ప్రేమ సమ్మోహనాస్త్రంగా పనిచేసింది

ఆమెమీద, అతను తనకు ఎంత ముఖ్యమో అతనికి అర్థమయినట్లు ప్రవర్తించేది. అతని మాట గౌరవించేది. అతని హృదయపు కోవెలలో దీపంలా మిగిలిపోయింది.

"మా నాన్నతో చెపుతాను... పెళ్ళికొడుకులా మా ఇంటికి వద్దువుగాని.." అని చెబుతూ అతని కళ్లల్లో నీళ్లు మునివేళ్లతో సుతారంగా తుడిచి బస్సు ఎక్కింది దేవి.

కానీ, తమ గేటులో అడుగుపెట్టగానే, ఆ నాగరికత, ఆ వాతావరణం ఆమెలో నిద్రలేచిన సున్నితత్వాలని ప్రాక్టికాలిటీతో సమాధి చేశాయి.

మూడునెలలు తిరక్కుండానే ఎవరో ఫారిన్‌లో ఉన్న డాక్టర్‌తో సంబంధం కుదిరింది. వెంటనే పెళ్లికి ఒప్పుకున్నది దేవి.

ఏమాత్రం మొహమాటం లేకుండా "మిష్టర్ రుద్ర" అని పెళ్లి ఇన్విటేషన్ పంపించింది.

పెళ్లి పందిట్లో అమ్మమ్మ కన్నీళ్లు చూడనట్లే నటించింది.

పైగా, "రాలేదేం మీ మనవడు?" అని ఎక్కిరించింది గౌరీపూజ చేస్తూ.

"నోర్ముయ్... నీకు నీమీద గౌరవం తప్ప, గౌరవించతగ్గ వేటిమీదా గౌరవం లేదు. వాడిని నువ్వు ఆశపెట్టి మభ్యపెట్టావు. అమ్మవారికి పూజ చేస్తున్నావు. అది కూడా నిన్ను నువ్వు వంచించుకోవటమే. ధ్యానాద్ధ్యాతృ ధ్యేయరూపమైన ఆ తల్లితో మమైకం అయ్యేవారి గుండెలు గుడి అవుతాయి. ప్రేమ, ఆప్యాయత, దయ, జాలి వీటితో అష్టోత్తరం చెయ్యాలి... నీకు ఏవే ఆ గుణాలు?! ఎంతసేపూ కనబడని ప్రపంచపు మెప్పుకోసం బతుకుదామనుకుంటున్నావు ముందు నిన్ను నువ్వు అర్థం చేసుకొని నీకు నువ్వు సమాధానం చెప్పుకో... ఆ రోజు రావాలని కోరుకుంటున్నాను..." ముత్తవకట్నం అక్కడ పెట్టేసి బండెక్కింది అమ్మమ్మ.. మొట్టమొదటిసారిగా ఉలిక్కిపడింది దేవి..

అప్పుడే వచ్చింది రిజిస్టర్ పార్శిల్..రుద్ర పంపిన పెళ్లి కానుక!

బంగారు తామరపూవులాంటి కుంకుమ భరిణ. అందులో ఎఱ్ఱటి అక్షింతలు.

"దేవీ... ఇవి నా రక్తాక్షతలు. నేను ఇంక బ్రతకను. నీకు నా ఆశీస్సులు..." ఆ ఉత్తరం చూసి అవాక్కైపోయింది దేవి. అతనిది ఆత్మహత్యా?! ఇవి అతడి రక్తంతో తడిసిన అక్షింతలా?!

కానీ..

"అఁ – అసలు అతనికి ఏదో జబ్బు ఉన్నది. ఆ పల్లెటూరు వాతావరణంలో ఉండి ముందరబెట్టుకున్నాడు. పోయేసమయానికి ఈ మెలోడ్రామా ఎందుకు?!" అనేసి మనసుని సరిపెట్టేసుకుంది ప్రాక్టికల్ మనిషి దేవి.

ఆ తరవాత దేవి ఫారిన్ వెళ్ళిపోయింది.

కాని, ఎప్పుడూ ప్రతిదీ డాలర్లతో ముడిపెట్టి, ఎవరి క్షేమం, అటు తనవారి క్షేమం, ఇటు భర్త తాలుకు వారి క్షేమం–రెండూ–ఆలోచించని దేవిని భరించడం ఎంతకష్టమో అర్థమైంది ఆమె జీవితేశ్వరుడుకి.

అందుకే రెండేళ్లలోనే ఆమె పెళ్లి కోర్టుకు ఎక్కింది. ఏమాత్రం అధైర్యపడకుండా, "ఛా! వెధవ మొగాళ్ళు" అని తిట్టుకుని, తన కడుపున పుట్టిన పిల్ల "బాల"ను పెంచుకుంటూ, చాలా ప్రఖ్యాతి చెంది డాక్టరుగా పేరూ ప్రతిష్ట, డబ్బూ సంపాదించుకున్నది దేవి. ఇదంతా అమెరికాలోనే సాధించుకోవాలనుకున్నా ఒంటరి జీవితం, ఆత్మీయత లేని జీవితం ఎంత కష్టమో అర్థమై తిరిగి ఇండియా వచ్చి, అనుకున్నది సాధించింది దేవి.

కళ్ళు మూసుకున్నా ఆమె ముందు గతం ఒద్దన్నా పరదాలు చించుతోంది. నిద్రరాదు... గుండెల్లో మంట, దుఃఖం..రక్తాక్షతలు..ఒద్దన్నా ఆమె కళ్లముందు రుద్ర, అతని మాటలు, అమ్మమ్మ అనిపోయిన దీవెనలు-అన్నీ గుర్తుకు వస్తున్నాయి.

ఆ రోజు అంతా ఆలోచిస్తోంది...

తన జీవన సమీక్షలో ఏదో లింకు తెగింది...అది ఏమిటి? తను ఎంతసేపూ ఒకపక్కనుంచే ఆలోచించిందా?! అటువైపునుంచి చూస్తే, ప్రేమ, గౌరవం, జాలి, ఆరాధన ఇవన్నీ ఉండేవా?! ఏమో...అమ్మమ్మ అన్నట్లు తనను తను తప్ప వేటిని గౌరవించిందని?!

లాభనష్టాల బేరీజుమధ్య సున్నితమైనవి ఎన్ని చచ్చిపోతాయో?! అమ్మమ్మ ఎంత సరిగ్గా అన్నది?!

"ఓర్యాణ పీఠ నిలయా..శృంగార రస సంపన్నా.."

లలితా సహస్రనామం మెల్లిగా ఆహ్లాదకరంగా టేపులోనించి వస్తోంది.

సహస్రనామాలు, శతనామాలు పెదవులు ఉచ్చరించడమే కానీ, తన భక్తిని తను శ్రద్ధతో ఏనాడైనా గౌరవించిందా?! తను పూజచేసే అమ్మవార్ని తన ప్రత్యేకతకు, గొప్పతనానికి ప్రతీకగా నిలిపింది కానీ, ఏనాడైనా తనలోని శక్తిని పుంజీభూతం చేసి పంచపూజలతో అమ్మవారికి అర్పించి "ప్రేమరూపా ప్రియంకరీ" అని అర్చించిందా?!

ధ్యానాధాతృధ్యేయరూపం-అమ్మమ్మ అన్నట్లు తను పూజ చేసేది, పూజా విధానం, పూజ చేస్తున్న తను-మూడూ ఒక వెలుగుగా మారలేకపోవడానికి కారణం తన "అహం" కాదా?!

అన్నీ పట్టుపట్టి సాధించాననుకున్న తనను, అహం తను కోరుకున్నది సంపాదించుకోనిచ్చింది కానీ, తనకు కావలసినది దొరకనియ్యకుండా చేసింది.

పశుపాశ విమోచనీ...ప్రాపంచికత, కోరికలతో స్వార్థంతో ఏర్పడిన పాశవిముక్తి చెయ్యమని తను ఏనాడైన కోరుకుందా?!

ఆలోచిస్తూ లేచింది దేవి.

❀ ❀ ❀

బాల, ఆమె స్నేహితురాళ్ళు ఆశ్చర్యపోయారు. విరించిని రమ్మనమన్నది దేవి.

తనచుట్టూ భయంభయంగా కూర్చొన్న ఆ ఎదుగుతున్న పిల్లల కళ్లల్లో తనను చూస్తే దడుపు... ప్రేమ, నమ్మకం లేవు... ఏం సంపాదించుకోగలిగింది తను?!

మెల్లిగా, నిట్టూర్చింది దేవి. మృదువుగా చెప్పింది.

"వయస్సులో సెన్టిమెంట్సుకు పునాదులు పడతాయి. అవి కాపాడుకోవడం గొప్ప వరం. విరించీ, నువ్వూ చాలా మంచి స్నేహితులుగా ఉండండి. మీ ఆకర్షణల మధ్య కాలం అడ్డురాకుండా ఉండి, మీలో మార్పు రాకుండా ఉంటే, ఐదేళ్ల తరవాత ఆలోచిద్దాం... ఈ లోపల మీరు బతుకుతున్న ప్రపంచంలో గౌరవంగా బ్రతికే చదువు, పద్ధతులు నేర్చుకోండి. కానీ... కానీ.. అందుకని, మీ ప్రేమల కోసం జీవితాలు బలి చేసుకోకండి... ప్లీజ్..." ఆమెగొంతులో జీర... జారుతున్న ప్రతి కన్నీటి బొట్టులోనూ దుద్ర....

ఆ పిల్లలకు ఎంత అర్థమయిందో ఆ సర్వేశ్వరికి తెలియాలి.

కానీ, మారుతున్న దేవి మాటలు కారుణ్యారుణిమతో అమ్మవారి చరణారవిందాలపై కాశ్మీర తందులాలై మెరుస్తున్నాయి... అవి మరో దృష్టికి కానీ అందనివి.... ఆమెలో నిజమైన పూజ అప్పుడే ప్రారంభమైంది!

(వనిత – నవంబరు, 1989)